సాక్షి
నిజామాబాద్
బుధవారం ၊ 19 ၊ జూలై ၊ 2023



విద్యార్థి భవితకు 'తొలిమెట్టు'

విద్యార్థుల్లో గుణాత్మక విద్యను పెంపొందించడమే లక్ష్యంగా ఈ ఏడాది మళ్లీ తొలిమెట్టు కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు.

- 8లో ▸



ఇబ్బందులు రాకుండా చూడాలి

వర్షాలతో గ్రామాల్లో ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు ఆదేశించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0 /23.1

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : జిల్లాలో ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకుని అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సంబంధిత శాఖల అధికారులకు మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల తాకిడితో ఎక్కడ కూడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అవసరమైన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్ని మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా అన్ని నివాస ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. చెరువుల్లో వచ్చి చేరుతున్న నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

పంటల పరిస్థితిపై వ్యవసాయ శాఖ ఆరా

డొంకేశ్వర్(ఆర్మూర్): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జిల్లాలో పంటల పరిస్థితిపై జిల్లా వ్యవసాయశాఖ ఆరా తీస్తోంది. వర్షాలతో వరి, మొక్కజొన్న పంటలపై పెద్దగా ప్రభావం ఉండదు. ముఖ్యంగా వర్షాధార పంటలైన పత్తి, సోయాపై ప్రభావం ఏ మేరకు ఉందని ఏఈవోలు వివరాలు సేకరిస్తున్నారు. పంటలు ఎక్కడైనా నీట మునిగాయా అని క్షేత్రస్థాయిలో రైతులను అడిగి తెలుసుకుంటున్నారు. ఈ పంటలు నీట మునిగితే మొక్కలు మురిగిపోయి చనిపోయే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు జిల్లాలో పత్తి 2,088 ఎకరాలు, సోయా 47,872 ఎకరాల్లో సాగైంది. ప్రస్తుతం మొక్క దశలో ఉన్నాయి. ఒకవేళ పంటల్లోకి వర్షపు నీరు చేరితే వెంటనే తొలగించాలని రైతులకు వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

కార్పొరేషన్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

నిజామాబాద్‌నాగారం: నగరంలో వర్షాలతో సమస్యలు ఏర్పడితే వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని, ఇందుకోసం మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ మకరందు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం 24 గంటల పాటు 08462-221001 ఫోన్ నంబర్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. అలాగే నగరంలోని ఆయా సర్కిల్ కార్యాలయాల్లో అధికారుల ఫోన్ నంబర్లకు ఫోన్లు చేయవచ్చన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలన్నారు.

సర్కిళ్ల వారీగా ఫోన్ నంబర్లు

సర్కిల్-1	9618210052
సర్కిల్-2	7396633773
సర్కిల్-3	9550023324
సర్కిల్-4ఏ	7815957095
సర్కిల్ -4బి	8555062383
సర్కిల్ -5	9010155505

మంత్రి ప్రశాంత్‌రెడ్డి ముక్కు నేలకు రాయాలి



మాట్లాడుతున్న మల్లికార్జున్‌రెడ్డి

బాల్కొండ: బట్టాపూర్ కంకర క్వారీ పైచేసిన ఆరోపణలు నిరూపించకపోతే ముక్కు నేలకు రాయాలని సవాల్ విసిరిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి హైకోర్టు తీర్పుతో ముక్కు నేలకు రాయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం బాల్కొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బట్టాపూర్ క్వారీకి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నందున వెంటనే మూసివేయాలని హైకోర్టు తీర్పు కాలుష్య నియంత్రణ బోర్డుకు ఆదేశాలను జారీ చేసిందన్నారు. క్వారీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారు నిరూపించకపోతే ముక్కు నేలకు రాస్తారా.. అంటూ బాల్కొండలో ఓ సమావేశంలో మంత్రి సవాల్ విసిరారన్నారు. ఇప్పుడు అదే సవాల్‌ను మంత్రి స్వీకరించాలన్నారు. ఇప్పటికీ హైకోర్టు తీర్పును తుంగలో తొక్కి ప్లాంట్‌ను కొనసాగిస్తున్నారన్నారు. త్వరలోనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. డీఎస్‌ను విమర్శించే నైతిక హక్కు మంత్రికి లేదన్నారు. సమావేశంలో నేతలు జీవీ నర్సింహారెడ్డి, నిమ్మల శ్రీనివాస్, అంబటి నవీన్, ఎంపీటీసీ పద్మ తదితరులు పాల్గొన్నారు.

వానొచ్చే.. వరదొచ్చే..

- జిల్లాలో విస్తారంగా వర్షాలు
- తడిసి ముద్దయిన ఇందూరు
- ఒర్రెలు, వాగుల్లో ప్రవహిస్తున్న నీళ్లు
- చెరువుల్లోకి చేరుతున్న కొత్త నీరు
- రానున్న రెండు రోజులు జిల్లాకు వర్ష సూచన!

జిల్లా వ్యాప్తంగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. గడిచిన 24 గంటలుగా వానలు కురుస్తుండడంతో ఇందూరు జిల్లా తడిసి ముద్దయ్యింది. జన జీనవం చాలావరకు స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు వచ్చి చేరుతోంది. ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి ఒర్రెలు, వాగుల్లో నీరు ప్రవహిస్తోంది. గుట్టలు, అటవీ ప్రాంతాల నుంచి కొత్త నీరు చెరువుల్లోకి చేరుతోంది. వానాకాలం సీజన్ మొదట్లో వర్షాలు ముఖం చాటేయడంతో రైతాంగం ఆందోళన చెందింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వారి కళ్లల్లో ఆనందం కనిపిస్తోంది. రానున్న రెండు రోజులు కూడా జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు.



గడ్కోల్ వద్ద చెక్‌డ్యాంపై నుంచి పారుతున్న నీరు

సుభాష్‌నగర్: జిల్లాలో గడిచిన 24 గంటల్లో 48.3 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కమ్మర్‌పల్లి, భీమ్‌గల్, సిరికొండ, నవీపేట్, తదితర మండలాల్లో వర్షం అధికంగా కురిసింది. అలాగే నగరం, మున్సిపాలిటీల్లో జనజీవనం స్తంభించి పోయింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు వచ్చి చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వ్యాపారాలు, రద్దీ ప్రాంతాల్లో జనం లేక వెలవెలబోయాయి.



ఇందల్వాయి మండలం నల్లవెల్లిలో ప్రవహిస్తున్న ఒర్రె

ఈ సీజన్‌లో ఇప్పుడే..

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు, ఒర్రెల్లో నీరు ఉరకలెత్తుతున్నాయి. ఇప్పుడిప్పుడే కొండలు, అటవీ ప్రాంతాల నుంచి వర్షపు నీరు చెరువుల్లోకి చేరుతోంది. ఈ సీజన్‌లో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలే అత్యధిక వర్షపాతంగా నమోదైంది. అంతేగాకుండా వర్షాలకు పొలం గట్లపై నుంచి నీరు ప్రవహిస్తోంది. గ్రామాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి.

25 మండలాల్లో సాధారణ వర్షపాతం

గడిచిన నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. సీజన్ ప్రారంభమై 45 రోజులు గడిచినా వర్షాలు కురవకపోవడంతో జిల్లావ్యాప్తంగా లోటు వర్షపాతమే నమోదైంది. కానీ నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 3 మండలాల్లో అత్యధిక వర్షపాతం, 25 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. మరో 5 మండలాల్లో ఇంకా లోటు వర్షపాతం ఉంది. సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు జిల్లాలో 9,901 మిల్లీమీటర్ల వర్షం కురవగా, గడిచిన 24 గంటల్లో 1396.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సీజన్‌లో ఇప్పటివరకు 300 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం, తాజాగా 48.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (మి.మీ.)	మండలం	వర్షపాతం
		ఎడపల్లి	41.8
కమ్మర్‌పల్లి	82.8	కోటగిరి	41.8
భీమ్‌గల్	71.5	సాలూర	41.0
సిరికొండ	62.5	ముప్కాల్	40.8
వేల్పూర్	62.5	ఆలూరు	40.5
నవీపేట	55.3	నిజామాబాద్‌రూరల్	39.8
ధర్పల్లి	55.0	చందూరు	39.3
బాల్కొండ	51.8	జక్రాన్‌పల్లి	39.3
మెండోరా	49.8	డిచ్‌పల్లి	37.5
మోర్తాడ్	49.5	మోస్రా	36.8
రెంజల్	47.8	ఇందల్వాయి	36.0
బోధన్	46.3	నందిపేట	35.8
ఆర్మూర్	45.3	మోపాల్	34.3
ఏర్గట్ల	45.3	డొంకేశ్వర్	33.0
నిజామాబాద్ నార్త్	45.3	వర్ని	33.0
మాక్లూర్	42.3	రుద్రూరు	28.3

31 టీఎంసీలకు శ్రీరాంసాగర్



శ్రీరాంసాగర్ జలాశయంలో ప్రస్తుత నీటిమట్టం

- 18 రోజుల్లో ఎగువ నుంచి 10 టీఎంసీలు
- జూన్‌లో వచ్చింది 0.7 టీఎంసీల వరద మాత్రమే..
- కాళేశ్వరం రివర్స్ పంపింగ్ ద్వారా 2.55 టీఎంసీల ఎత్తిపోత
- 50 టీఎంసీలకు చేరితే వానాకాలం సీజన్‌కు ఢోకా లేనట్లే..

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: శ్రీరాంసాగర్ జలాశయంలోకి ఎగువన నుంచి వరద కొనసాగుతున్న నేపథ్యంలో తాజా నీటిమట్టం 31.423 టీఎంసీలకు చేరింది. అయితే గత జూన్ నెలలో ఎగువ ప్రాంతాల నుంచి కేవలం 0.7 టీఎంసీల నీరు మాత్రమే ప్రాజెక్టులోకి వచ్చి చేరింది. ప్రస్తుత జూలై నెలలో వర్షాలు కురుస్తుండడంతో గత 18 రోజుల్లో 10 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ఇక ఈ నెలలో 10 రోజుల పాటు కాళేశ్వరం రివర్స్ పంపింగ్ ద్వారా 2.55 టీఎంసీల నీటిని ఎస్సారెస్పీలోకి ఎత్తిపోశారు.

కాళేశ్వరం ద్వారా రోజుకు 0.255 టీఎంసీల నీరు పంపింగ్ అయింది. గత జూన్ 1వ తేదీ నాటికి జలాశయంలో 20.06 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం జలాశయంలో 31.423 టీఎంసీల నీరు ఉంది. కాగా ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. మంగళవారం రాత్రి వరకు ఎగువ నుంచి 17,215 క్యూసెక్కుల వరద వస్తోంది. జలాశయం నీటి మట్టం 1091 అడుగులు(90 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1071.2 అడుగుల(31 టీఎంసీల) నీరుంది.

జూన్‌లో వర్షాలు కురవకపోవడంతో..

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఎగువ నుంచి గోదావరిలోకి వరద వస్తోంది. దీంతో శ్రీరాంసాగర్ పునరుజ్జీవన పథకం కింద కాళేశ్వరం ఎత్తిపోతల జలాల తరలింపును ఈనెల 17న నిలిపేశారు. కాగా జూన్‌లో వర్షాలు సమయానికి కురవకపోవడంతో కేవలం 0.7 టీఎంసీల వరద నీరు మాత్రమే వచ్చి చేరింది. అయితే గత 18 రోజుల్లో మాత్రం 10 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు జలాశయం ద్వారా జూన్ 1 నుంచి ఇప్పటివరకు కాల్వలు, ఎత్తిపోతల పథకాల ద్వారా, తాగునీటి అవసరాల నిమిత్తం కలిపి 3.03 టీఎంసీల నీటిని వదిలారు. కాగా జలాశయంలోకి 50 టీఎంసీల మేర నీరు చేరితే ప్రస్తుత వానాకాలం పంటకు ఢోకా ఉండదు.

మంజీరకు వరద

బోధన్: మంజీర నది జలకళను సంతరించుకుంది. మహారాష్ట్ర సరిహద్దులోని సాలూరకు సమీపంలో గల నదిలోకి వరద నీరు భారీగా చేరుతోంది. ఇన్నాళ్లు నీటి ప్రవాహం లేక వెలవెలబోయిన నది ప్రస్తుతం వరద నీటి కళకళలాడుతోంది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వరద నీరు ప్రవాహం పెరిగింది. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశాలున్నాయి.



బీఎల్‌వోలకు అవగాహన కల్పించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: ఓటరు జాబితాపై బూత్ లెవెల్ అధికారులకు పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు మంగళవారం కొత్త కలెక్టరేట్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఓటరు జాబితా రూపకల్పనలో పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా ఓటరు జాబితా రూపొందేలా కృషి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో క్రియాశీలకంగా వ్యవహరించే బీఎల్‌వోలకు ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈమేరకు మాస్టర్ ట్రైనర్లు తమ నియోజకవర్గాల్లో మండలాల వారీగా బీఎల్‌వోలకు శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

కొత్త ఓటర్లను గుర్తించి ఓటరు జాబితాలో తప్పనిసరిగా వారి పేర్లు నమోదు చేయించాలన్నారు. ఇంటింటి సర్వే ద్వారా ఓటరు జాబితాలో ఏవైనా మార్పులు, చేర్పులు, తొలగింపులు ఉంటే, నిబంధనలకు అనుగుణంగా చేపట్టేలా ప్రతి బీఎల్‌వోకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో నిజామాబాద్ కార్పొరేషన్ కమిషనర్ మకరంద్, ఆర్డీవోలు రాజేశ్వర్, వినోద్ కుమార్, డీసీవో సింహాచలం, డీపీవో జయసుధ, ఉపాధి హామీ ఏపీడీ సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన పాలిసెట్ కౌన్సెలింగ్

నిజామాబాద్‌అర్బన్: పాలిసెట్- 2023 తుది విడత ప్రక్రియ మంగళవారం ముగిసింది. ఇదివరకే కళాశాలలో చేరిన విద్యార్థులు, ఈనెల 19, 20 తేదీల్లో చేరే విద్యార్థులకు అదే కాలేజీలో మరొక బ్రాంచ్ మార్పునకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపల్ శ్రీరాంకుమార్ తెలిపారు. మార్పులకు సంబంధించి ఈనెల 23న కొత్త సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈనెల 24న సదరు కాలేజీలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందన్నారు. తర్వాత మిగిలిన సీట్లకు ఈనెల 28న స్పాట్ అడ్మిషన్ల ద్వారా పూర్తి చేస్తామన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా..

- బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ మంద మకరందు

నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ నగర మున్సిపల్ కమిషనర్‌గా మంద మకరందు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో నెలకొన్న సమస్యలను ప్రజలు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, చెత్త సేకరణ ఇలా ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తేవాలన్నారు. అధికారులు, సిబ్బందితో కలిసి సమన్వయంగా పని చేస్తామన్నారు. నగర ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మేయర్ దండు నీతూకిరణ్, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, మంత్రి ప్రశాంత్‌రెడ్డిని మకరందు మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న మకరందు

దత్తత గ్రామాల్లో విద్యుత్ పనులు పూర్తిచేయాలి



ఉమ్మడి జిల్లా విద్యుత్ అధికారులతో సమీక్షిస్తున్న సీఎండీ గోపాల్‌రావు

- ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్ తగ్గించాలి
- వంద శాతం బిల్లులు వసూలు చేయాల్సిందే
- సీఎండీ గోపాల్‌రావు

నిజామాబాద్ నాగారం : జిల్లాలోని ఆయా మండలాలు, గ్రామాల్లో దత్తత తీసుకున్న డీఈ, ఏడీఈ, ఏఈలు అందరూ కచ్చితంగా ఈ నెల చివరికల్లా విద్యుత్ పనులు పూర్తి చేయాలని సీఎండీ గోపాల్‌రావు ఆదేశించారు. మంగళవారం విద్యుత్‌శాఖ ఎస్ఈ కార్యాలయంలో ప్రత్యేకంగా కామారెడ్డి, నిజామాబాద్ జిల్లా అధికారులతో సమీక్షించారు. సీఎండీ మాట్లాడుతూ, ట్రాన్స్‌ఫార్మర్స్ ఫెయిల్యూర్స్ తగ్గించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు చేసిన తర్వాత ప్రభుత్వ వాహనంలో తరలించాలన్నారు. వంద శాతం బిల్లులు వసూళ్లు చేయాలని, ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించేలా చూడాలన్నారు. ఆగిపోయిన మీటర్లు మార్చాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. వినియోగదారులు, రైతులతో సంబంధాలు మెరుగుపర్చుకోవాలని సూచించారు. పనుల్లో నిర్లక్ష్యం చేయవద్దని, నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లా ఎస్ఈ రవీందర్, కామారెడ్డి ఎస్ఈ రమేష్ బాబు, డీఈలు అనిల్‌కుమార్, రమేష్, ముక్తార్, వెంకటరమణ, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రావు, ఎస్ఈవో ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఈసీ సభ్యుల పదవీ కాలం పొడిగింపు

- ఉత్తర్వులు జారీ చేసిన ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ
- తెలంగాణ యూనివర్సిటీలో పరిణామాల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని వర్సిటీల్లో..

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీతో పాటు రాష్ట్రంలోని తొమ్మిది వర్సిటీల పాలక మండలి(ఈసీ) సభ్యుల పదవీ కాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఉత్తర్వులు జారీ చేశారు. కేటగిరి-2 సభ్యులతో పాటు కేటగిరి-1 పాలకమండలి సభ్యుల పదవీ కాలాన్ని సైతం పొడిగించారు. సభ్యుల పదవీకాలం 2023 ఫిబ్రవరి 28న ముగిసిన విషయం తెలిసిందే. అదేరోజు నుంచి వారి పదవీకాలం ఏడాది పాటు లేదా కొత్త సభ్యులను నియమించే వరకు పొడిగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తెయూ వ్యవహారాల కారణంగానే..

తెలంగాణ వర్సిటీ మాజీ వీసీ రవీందర్‌గుప్తా, పాలక మండలి సభ్యుల మధ్య 2023 ఏప్రిల్ నుంచి జూన్ వరకు చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రవీందర్‌గుప్తా, ఈసీ అనుమతి లేకుండానే అక్రమ పదోన్నతులు, నియామకాలు చేపట్టారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా విచ్చలవిడిగా కొనుగోళ్లు, చెల్లింపులు, నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రిజిస్ట్రార్లను మారుస్తూ పోయారు. గత ఏప్రిల్ 19న జరిగిన టీయూ పాలక మండలి సమావేశంలో వీసీ అక్రమాలపై ఈసీ సభ్యులు పలు చర్యలకు తీర్మానించారు. అలాగే అప్పటి ఈసీ మెంబర్, కళాశాల విద్యా కమిషనర్ అయిన నవీన్ మిట్టల్ సైతం వీసీ రవీందర్ అవినీతి, అక్రమాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజీనామా చేసి వెళ్లాలని కోరారు. అప్పటి నుంచి వీసీ వర్సెస్ ఈసీగా పరిస్థితులు మారాయి. ఇదే సమయంలో ఈసీ సభ్యుల పదవీకాలం ఫిబ్రవరిలోనే ముగిసిందని వారు చేసిన తీర్మానాలను రద్దు చేయాలని కోరుతూ వీసీ రవీందర్ హైకోర్టును ఆశ్రయించారు. కాలం చెల్లిన ఈసీ మెంబర్లు తనపై చేసిన తీర్మానాలు చెల్లవని మీడియా ముఖంగా పలుమార్లు ప్రకటించారు. రవీందర్ మాటలను పట్టించుకోకుండా ఈసీ సభ్యులు యథావిధిగా సమావేశాలు నిర్వహిస్తూ వీసీతో పాటు ఆయనకు సహకరించిన మాజీ రిజిస్ట్రార్లు, సిబ్బందిపై చర్యలకు తీర్మానాలు చేస్తూ పోయారు. తెలంగాణ వర్సిటీలో జరిగిన పరిణామాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు గమనించింది. ఈ క్రమంలో గత నెల 17న రవీందర్ గుప్తా ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కి అరెస్టయ్యారు. ఈ క్రమంలో తెయూతో పాటు ఇతర విశ్వవిద్యాలయాలకు సంబంధించిన ఈసీ సభ్యుల పదవీ కాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. దీంతో ఇప్పుడు ఈసీ తీర్మానాల అమలు విషయంలో ఎలాంటి అడ్డంకులు లేకుండా పోయినట్లు వర్సిటీ వర్గాలు పేర్కొన్నాయి.

క్లుప్తంగా

జిల్లాలో సీఐల బదిలీలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ టౌన్ సీఐగా నరహరి బదిలీ అయ్యారు. ఆయనను సీసీఆర్‌బీ నుంచి టౌన్ సీఐగా బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బాసర మల్టీజోన్ పరిధిలో 45 మంది సీఐలను బదిలీ చేస్తు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రుద్రూర్ సీఐగా పనిచేస్తున్న జానారెడ్డిని గజ్వేల్ టౌన్ సర్కిల్‌కు బదిలీ చేశారు. ఎస్‌బీ నిజామాబాద్‌లో పనిచేస్తున్న ఎండీ ముఖీద్‌పాషాను ఐజీ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. నిజామాబాద్ వన్‌టౌన్ సీఐగా పనిచేస్తున్న వెంకట్‌నారాయణను సౌత్ రూరల్ సీఐగా బదిలీ చేశారు. సౌత్ రూరల్ సీఐగా పనిచేస్తున్న ఎం సురేందర్‌రెడ్డిని ఐజీ ఆఫీసులో రిపోర్టు చేయాలని ఆదేశించారు. నిజామాబాద్ రైల్వేస్టేషన్ ఎస్‌హెచ్‌వో ప్రణయ్‌కుమార్ ఆదిలాబాద్ ట్రాఫిక్ సీఐగా బదిలీ అయ్యారు.

కొనసాగుతున్న పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్ ఎం అరుణ తెలిపారు. ఉదయం జరిగిన ఎంబీఏ, ఎంసీఏ 2వ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షకు 629 మంది విద్యార్థులకు 588 మంది హాజరు కాగా 41మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ఎంబీఏ, ఎంసీఏ నాలుగో రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షకు 475 మంది విద్యార్థులకు 460 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. అలాగే ఉదయం జరిగిన డిగ్రీ ఐదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 139 మంది విద్యార్థులకు 105 హాజరైనట్లు తెలిపారు.

బెటాలియన్‌లో 'హర్ ఘర్ ధ్యాన్'



డిచ్‌పల్లి: డిచ్‌పల్లిలోని ఏడో బెటాలియన్‌లో మంగళవారం ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా ట్రైనర్ రాజారాణి అగర్వాల్ బృందం ఆధ్వర్యంలో హర్ ఘర్ ధ్యాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మెడిటేషన్, ప్రాణాయామం, యోగాసనాల గురించి బెటాలియన్ సిబ్బందికి నేర్పించారు. కమాండెంట్ సత్యశ్రీనివాస్, అసిస్టెంట్ కమాండెంట్స్ వెంకటేశ్వర్లు, భాస్కర్‌రావు, ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

20న అల్బెండజోల్ మాత్రల పంపిణీ

నిజామాబాద్ సిటీ: జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ఈ నెలా 20న జిల్లాలో ఒకటి నుంచి 19 ఏళ్ల వారందరికి అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు డీఎంహెచ్‌వో సుదర్శనం తెలిపారు. ప్రతి అంగన్‌వాడి కేంద్రంలో, ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, ఇంటర్ కళాశాలలో వైద్య సిబ్బంది ఈ మాత్రలను అందిస్తారని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపిక

నిజామాబాద్‌నాగారం: స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు క్రీడల అధికారి ముత్తెన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు హకీంపేటలో జరుగుతాయన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 24న ఉదయం 10గంటలకు కలెక్టరేట్ మైదానంలో క్రీడల అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఎంపికైన వారు

నాలుగో తరగతిలో భుక్య భాను(భీంగల్), మలావాత్ టైసర్(ధర్పల్లి), భుక్య భార్గవ్(భీంగల్), ఎల్లేటి నైషరెడ్డి(మాణిక్‌భండార్), గుగ్లోత్ సంకీర్తన(ధర్పల్లి డీబీ తండా). ఐదో తరగతిలో జి ధర్మతేజ(తడ్‌పకల్), పి ఆదిత్యవర్ధన్(కోటగిరి), నితీష(గోవురు) ఎంపికయ్యారు.

మహాలక్ష్మినగర్‌లో చైన్ స్నాచింగ్

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహాలక్ష్మి రోడ్ నంబర్-1లో శోభ మెడలో నుంచి రెండు తులాల బంగారు చైన్‌ను లాక్కెళ్లారు. స్కూటీపై వచ్చిన ఇద్దరు చైన్ లాక్కొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు.

'ఉద్యోగ భద్రత కల్పించాలి'



భిక్కనూరు: యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగాలను రెగ్యులర్ చేసేందుకు ప్రభుత్వం వెంటనే మంత్రి మండలి సబ్‌కమిటీని ఏర్పాటు చేయాలని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నారాయణ గుప్తా డిమాండ్ చేశారు. మంగళవారం భిక్కనూరు సౌత్ క్యాంపస్‌లో కాంట్రాక్టు అధ్యాపకులు వర్షంలో గొడుగులు చేత పట్టుకుని నిరసన తెలిపారు. రెగ్యులరైజ్ చేయాలని నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కాంట్రాక్టు అధ్యాపకులు యాలాద్రి, నర్సయ్య, రమాదేవి, సునీత, వైశాలి, నిరంజన్, శ్రీకాంత్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి భవితకు తొలిమెట్టు

- ఈ ఏడాది అమలుకు విద్యాశాఖ కసరత్తు
- 21 నుంచి టీచర్లకు శిక్షణ
- గుణాత్మక విద్య పెంపొందించడమే లక్ష్యం

నిజామాబాద్‌అర్బన్: విద్యార్థుల్లో గుణాత్మక విద్యను పెంపొందించడమే లక్ష్యంగా ఈ ఏడాది మళ్లీ తొలిమెట్టు కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. గతేడాది నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు కొంత మెరుగయ్యారు. దీంతో అదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా తొలిమెట్టు కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు. దీనికి సంబంధించి విద్యా శాఖ ఏర్పాట్లు కూడా పూర్తి చేసింది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులకు గుణాత్మక విద్యను పెంపొందించడం తెలుగు, ఇంగ్లిష్ చదవడం, రాయడం, గణితంలో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

ఉన్నత విద్యార్థులకు 'లిప్'

ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్(లిప్) కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో దీనిని సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో అమలు చేయనున్నారు. విద్యార్థులకు మాతృభాషతో పాటు ద్వితీయ భాష, తృతీయ భాషలో స్పష్టంగా మాట్లాడడం, తప్పులు లేకుండా రాయడం నేర్పడం దీని ఉద్దేశం. స్వీయ సామర్థ్యాల పెంపు, గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రాల్లో విద్యార్థులు ప్రతిభ చాటేలా కార్యక్రమాన్ని రూపొందించారు.



మండలానికి ఆరుగురు టీచర్లకు శిక్షణ

జిల్లాలో తొలిమెట్టు కార్యక్రమానికి సంబంధించి ఈ నెల 21, 22, 24 తేదీల్లో జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి మండలం నుంచి ఆరుగురు ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమానికి హాజరవుతారు. అనంతరం మండల స్థాయిలో తెలుగు, గణితం, ఆంగ్లం బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు. అనంతరం తొలిమెట్టు కార్యక్రమాన్ని పాఠశాల స్థాయిలో ఆగస్టు నుంచి ప్రారంభించనున్నారు. జిల్లాలో డీఈవో పరిధిలో 666 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. 192 మంది ఉపాధ్యాయులు ఆయా బడుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. తొలిమెట్టుతో పాటు ఎఫ్ఎల్ఎం కార్యక్రమాన్ని కూడా ఇది వారికే అమలు చేశారు. ఇందులో విద్యార్థుల సామర్థ్యాలు గుర్తించిన అధికారులు రెండోసారి తొలిమెట్టు కార్యక్రమం అమలు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు చదవడం, రాయడం నేర్పిస్తారు. వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించి చదువులో ముందుకు వెళ్లేలా ప్రోత్సహించారు.

పకడ్బందీగా చేపడతాం



ఈ ఏడాది తొలిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపడతాం. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో రిసోర్స్‌పర్సన్‌లు శిక్షణ తీసుకున్నారు. 21 నుంచి జిల్లాలో శిక్షణ కార్యక్రమాలు చేపడతాం. విద్యార్థుల్లో గుణాత్మక విద్యను పెంపొందించే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరుగుతుంది.

– దుర్గాప్రసాద్, డీఈవో

విద్యార్థులకు ఎంతో ఉపయోగం



గతేడాది తొలిమెట్టు కార్యక్రమం నిర్వహించారు. దీంతో ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగయ్యాయి. ప్రస్తుతం కూడా ఈ కార్యక్రమం నిర్వహించడంతో విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది.

– వెనిగళ్ల సురేశ్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

లింబాద్రిని ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి

సిరికొండ: మారుమూల గ్రామం నుంచి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ వరకు ఎదిగిన ప్రొఫెసర్ లింబాద్రిని ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి అన్నారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ స్వగ్రామమైన మండలంలోని రావుట్లలో మంగళవారం అభినందన సభ నిర్వహించారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్‌గా నియామకమై తొలిసారి గ్రామానికి వచ్చిన లింబాద్రికి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. లింబాద్రి భారతి దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ.. పుట్టిన రోజు నాడు పెద్ద హోదాలో సన్మానం అందుకోవడం లింబాద్రి జీవితంలో మర్చిపోలేనిదన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగిన పుట్టిన ఊరును మరవకపోవడం ఆయన నిరాడంబరతకు నిదర్శనమన్నారు. తెలంగాణ యూనివర్సిటీ వీసీగా తాను, రిజిస్ట్రార్‌గా లింబాద్రి కలిసి యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేశామన్నారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి మాట్లాడుతు తాను చదువుకునే రోజుల్లో ఎన్నో కష్టాలు అనుభవించానన్నారు. తన కష్టసుఖాల్లో గ్రామస్తులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. తల్లిదండ్రులు నేర్పిన క్రమశిక్షణతోనే తాను ఇంత ఎత్తుకు ఎదిగానన్నారు. తనకు ఉన్నత పదవి రావడానికి సహకరించిన మంత్రులు కేటీఆర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం అందచేశారు. ఓయూ వీసీ రవీందర్‌యాదవ్, మాజీ న్యాయమూర్తి నిమ్మ నారాయణ, అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ వీసీ రాంచంద్రం, మధుశేఖర్, తహసీల్దార్ గఫార్‌మియా, ఎంపీడీవో లక్ష్మీప్రసాద్, సర్పంచ్ భూదేవ్వ, వైస్ ఎంపీపీ రాజన్న, వీడీసీ చైర్మన్ రమేష్‌గౌడ్, బాలయ్య, సాల్మన్, దేవిక, నర్సయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



లింబాద్రి దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

నిజాంసాగర్‌లోకి 750 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం 750 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నందున వాగుల ద్వారా మంజీర నదిలో వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా.. మంగళవారం సాయంత్రానికి 1,388.03 అడుగుల(3.304 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

మరో మూడు రోజులు వర్షాలు

రుద్రూర్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ వాతావరణ విభాగం శాస్త్రవేత్త శ్రీలక్ష్మి తెలిపారు. అధిక వర్షాల వల్ల విత్తుకున్న విత్తనాలు నీటి ముంపునకు గురి కాకుండా కాల్వల ద్వారా బయటకు పంపించాలని రైతులకు సూచించారు.

పదకొండు మంది మృతికి కారణమైన వ్యక్తికి పదేళ్ల జైలు

ఖలీల్‌వాడి : ఆరుగురు చిన్నారులు, ఐదుగురు మహిళల మృతికి కారణమైన వ్యక్తికి పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ రెండవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి టి శ్రీనివాస్ మంగళవారం తీర్పు వెలువరించారు. ఆర్మూర్ రూరల్ సర్కిల్ పోలీస్ అధికారి రమణ రెడ్డి కోర్టుకు సమర్పించిన అభియోగ పత్రం ప్రకారం.. నేర న్యాయ విచారణ ప్రక్రియలో భాగంగా 38 మంది ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేసుకుని, 43 పత్రాలను పరిశీలించారు. వ్యక్తిగత నిర్లక్ష్యాన్ని పరిగణనలోకి తీసుకుని ముప్కాల్‌కు చెందిన ముద్దాయి గోపీ శ్రీనివాస్ యాదవ్‌కు ఈ శిక్ష విధించారు. 2018 మార్చి 25న శ్రీనివాస్ తన ఆటో (టీఎస్16 యుబీ 5782)లో ముప్కాల్, కొడిచెర్ల గ్రామాల నుంచి 19 మంది ప్రయాణికులతో బయలుదేరాడు. పరిమితికి మించిన ప్రయాణికులు, అతివేగం, అజాగ్రత్తగా ఆటోను నడపడంతో ఆటో మెండోరా గ్రామ శివారున రోడ్డుపై పల్టీలు కొట్టి రోడ్డు పక్కన వ్యవసాయ బావిలో పడిపోయింది. బావిలోని నీటిలో మునిగి బాల్కొండ మండలం చిట్టపూర్ గ్రామానికి చెందిన ఏడు సంవత్సరాల తెడ్డు ప్రశంశ, ఐదేళ్ల తెడ్డు చక్కాని, సంవత్సరంన్నర తెడ్డు చిన్ని, ఇరవై ఐదేళ్ల తెడ్డు రోజా, బాల్కొండ మండలం కొడిచెర్ల గ్రామానికి చెందిన ఆరు సంవత్సరాల మెట్టు విన్యశ్రీ, వర్ని మండలం మోస్రా గ్రామవాసి పద్నాలుగేళ్ల పెద్దోల్ల సంపత్, ఆర్మూర్ మండలం ఆలూరు గ్రామ చిన్నారి ఐదేళ్ల పుట్ట మనస్విని, మోర్తాడ్ మండలం ధర్మోరా మద్దికుంట లక్ష్మి, బాల్కొండ మండలం వెంపల్లి బొప్పారం సాయమ్మ, మెండోరా మండలవాసి నిమ్మ సత్తెమ్మ, డిచ్పల్లి మండలం కేశపూర్ వాసి గుండ్రపు గంగు చనిపోయారు. మరో తొమ్మిది మంది గాయపడ్డారు. ముద్దాయి గోపీ శ్రీనివాస్‌పై నేరారోపణలు రుజువు అయినట్లు నిర్ధారిస్తూ భారత శిక్షాస్మృతి సెక్షన్ 304 పార్ట్ 2 ప్రకారం పది సంవత్సరాల కఠిన జైలు శిక్ష, సెక్షన్ 337 ప్రకారం ఆరు నెలల సాధారణ జైలుశిక్ష, సెక్షన్ 338 ప్రకారం సంవత్సరం జైలుశిక్ష విధించారు. శిక్షలన్నీ ఏకకాలంలో అనుభవించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

బోధన్‌టౌన్: పట్టణంలోని ఆచన్‌పల్లిలో మంగళవారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. కాలనీకి చెందిన తాండ్రాల అనిత కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తోంది. మంగళవారం ఆమె ఇంట్లో లేని సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో ఇంట్లోని సామగ్రి, రూ.పది వేల నగదు కాలిపోయింది. ఆర్ఐ వరుణ్ పంచనామా చేశారు. రూ.లక్ష 50 వేల వరకు నష్టం జరిగిందని బాధిరాలు తెలిపారు. బాధితురాలిని మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి పరామర్శించారు. తూము శివమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సరుకులు, నగదు అందించారు. ఇందూర్ పాఠశాల కరస్పాండెంట్ కోడాలి కిశోర్‌కుమార్ రూ.5 వేల నగదు, గ్రామస్తులు రూ.20 వేలు అందజేశారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మాశరత్‌రెడ్డి

గుండెపోటుతో ఎంపీడీవో మృతి



ఎంపీడీవో నారాయణ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఎంపీడీవో నారాయణ (58) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు నెల రోజుల క్రితం మెదడులో రక్తం గడ్డ కట్టడంతో చికిత్స తీసుకొని వారం క్రితం విధుల్లో చేరారు. మంగళవారం గుండెపోటు రావడంతో నిద్రలోనే మృతి చెందినట్లు తెలిపారు.

వర్షానికి కూలిన ఇళ్లు



రుద్రూర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మంగళవారం మూడు ఇళ్లు కూలిపోయాయి. కోటగిరి మండలం కొత్తపల్లిలో సైదయ్య, సాయిలుకు చెందిన ఇళ్లు పోతంగల్ మండలం కొడిచర్లలో ఒక ఇల్లు కూలిపోయింది. కొత్తపల్లిలో కూలిన ఇళ్లను ఎంపీడీవో మనోహర్ రెడ్డి పరిశీలిచారు. నిరాశ్రయులైన వారికి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాల్సిందిగా జీపీ సిబ్బందిని ఆదేశించారు. ఆయనతో జీపీ కార్యదర్శి స్వప్న ఉన్నారు.

టిప్పర్ ఢీకొని ఒకరికి గాయాలు

ఖలీల్‌వాడి: నగరంలోని నిజాంకాలనీ వద్ద టిప్పర్, బైక్‌ను ఢీకొనడంతో ఒకరికి గాయాలైనట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. బోధన్‌కు చెందిన నౌకత్ పాషా నిజామాబాద్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం నిజామాబాద్‌కు వస్తుండగా నిజాంకాలనీ వద్ద టిప్పర్ ఢీకొంది. ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

సదాశివనగర్: మండలంలోని ఉత్తునూర్ గ్రామానికి చెందిన నవీన్ మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్సై సాగర్ తెలిపారు. నవీన్ ఈ నెల 14న బైక్‌పై కామారెడ్డి నుంచి స్వగ్రామానికి వస్తుండగా పద్మాజీవాడి చౌరాస్తా వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న భారీకేడ్లను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు కావడంతో కామారెడ్డికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. నవీన్ గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మృతుడి భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై తెలిపారు.

క్రీడలతో వ్యక్తిత్వ వికాసం

- ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే మెరుగైన సేవలు
- ఎన్‌పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు
- విద్యుత్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్, క్యారం పోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎండీ గోపాల్‌రావు

నిజామాబాద్‌నాగారం: ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే మెరుగైన సేవలు అందిస్తారని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు అన్నారు. క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి దోహద పడుతాయన్నారు. రాష్ట్రస్థాయి విద్యుత్ ఉద్యోగుల ఫుట్‌బాల్, క్యారం పోటీలను మంగళవారం నగరంలో ఆయన ప్రారంభించారు. ఉద్యోగులతో కలిసి క్యారం ఆడి పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సంస్థ అభివృద్ధికి పాటు పడాలని సూచించారు. క్రీడా స్ఫూర్తితో ఆడి ఉన్నతంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు రవీందర్, రమేష్‌బాబు, సూర్యనారాయణ, స్పోర్ట్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ తోట రాజశేఖర్, గంగారం నాయక్, సురేష్‌కుమార్, డీఈలు రమేష్, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రావు, ఎండీ ముక్తార్, వెంకటరమణ, హరిచంద్ పాల్గొన్నారు. వర్షం పడటంతో ఫుట్‌బాల్ మ్యాచ్‌లను వాయిదా వేశారు.

నిబంధనలకు విరుద్ధంగా వేతనాలు

- ఎంఈవో ప్రొసీడింగ్ లేకున్నా సెలవుల వేతనం మంజూరు చేసిన హెచ్ఎం
- విచారణ చేసిన విద్యాశాఖ అధికారులు

నిజామాబాద్‌అర్బన్: పాఠశాల హెచ్ఎం నిబంధనలకు విరుద్ధంగా ఉపాధ్యాయులకు సెలవుల వేతనం మంజూరు చేశారు. ఈ ఘటన ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో చోటు చేసుకుంది. దీనిపై ఫిర్యాదు అందడంతో డీఈవో దుర్గాప్రసాద్ మాక్లూర్ ఎంఈవో రాజ్‌గంగారెడ్డిని విచారణ అధికారిగా పంపించారు. ఆయన మంగళవారం పాఠశాలలో విచారణ చేపట్టారు. వివరాలు.. ఎల్లారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఏడుగురు ఉపాధ్యాయులు గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు వివిధ సందర్భాల్లో సెలవులు తీసుకున్నారు. సెలవులు రోజుల వేతనాలు పొందాలంటే సంబంధిత ఎంఈవో ప్రొసీడింగ్ జారీ చేయాల్సి ఉంటుంది. ఆయా టీచర్లు ఎప్పుడూ సెలవులు తీసుకున్నారు, ఎన్ని రోజులు సెలవుల్లో ఉన్నారు, దానికి సంబంధించిన పూర్తి వివరాలను ఎంఈవో పరిశీలన చేసి ప్రొసీడింగ్ జారీ చేస్తారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉత్తర్వుల ప్రకారం డీడీవో పంపి సంబంధిత టీచర్ల వేతనాలను జారీ చేయాల్సి ఉంటుంది. కానీ పాఠశాల హెచ్ఎం భూమయ్య ఈ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోలేదు. మండల విద్యాశాఖ అధికారి ప్రొసీడింగ్ లేకుండానే పాఠశాలలోని ఏడుగురు టీచర్లకు లీవ్ సెటిల్మెంట్ కాకుండా వేతనాలను మంజూరు చేశారు. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధం. డీఈవో విచారణ చేయించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఈ విషయమై వివరణ కోరేందుకు హెచ్ఎం భూమయ్యను సంప్రదించగా స్పందించలేదు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఇప్పటికే 70 శాతం మేర చెరువులు నిండాయని ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఇరిగేషన్ అధికారులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు సిరికొండ, ఇందల్వాయి, ధర్పల్లి మండలాల్లో అత్యధికంగా వర్షపాతం నమోదైనట్లు అధికారులు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. రూరల్ నియోజకవర్గం పరిధిలో 304 చెరువులుండగా వర్షాలతో 70 శాతం మేర నిండి ఉన్నాయని అధికారులు వివరించారు. ముందు కురిసే వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. పెద్ద చెరువులైన జక్రాన్‌పల్లి, న్యావనంది, ధర్పల్లి, ఒన్నాజీపేట్, బొడ్డిమామిడి చెరువు, గుండారం, మల్కాపూర్ చెరువుల పరిస్థితిపై తెలుసుకున్నారు. ఇటీవల అకాల వర్షాలకు చెరువు కట్టలు దెబ్బతిన్న గన్నారం, పడకల్ చెరువుల పనులు పూర్తయినందున వాటిలో వర్షం నీటి పరిస్థితిపై ఆయన ఆరా తీశారు. లిఫ్టుల వద్ద సేఫ్టీ మెజర్‌మెంట్స్ పాటించాలని సూచించారు. ఈ సమీక్షలో ఇరిగేషన్ శాఖ ఈఈలు, డిప్యూటీ ఈఈలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

వర్షపు నీటితో ఇబ్బందులు రాకుండా చూడాలి

- సంక్షేమ పథకాలను అర్హులకు అందించాలి
- సొసైటీల్లో అక్రమాలు జరిగితే చర్యలు తీసుకోవాలి
- జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

నిజామాబాద్‌నాగారం : వర్షాలతో గ్రామాల్లో ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు ఆదేశించారు. మంగళవారం జిల్లా పరిషత్‌లో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధిపై స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని పంచాయతీల్లో పరిశుభ్రతను పాటించాలన్నారు. మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత పంచాయతీలు తీసుకోవాలని డీపీవోను ఆదేశించారు. ఇసుక క్వారీలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని, అక్రమ రవాణా జరగకుండా చూసుకోవాలని మైన్స్ శాఖ ఏడీని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అందరికీ అందేవిధంగా చూడాలన్నారు. సొసైటీలో అవకతవకలు జరగకుండా విధిగా ఆడిట్ జరిగేటట్లు రైతులకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని డీసీవోను ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ రజిత ఎల్లయ్య యాదవ్, సీఈవో గోవింద్, జెడ్పీటీసీ సభ్యులు నారోజి గంగారాం, మాన్సింగ్, సుమలత, కో-ఆప్షన్ సభ్యులు సిరాజ్, డిప్యూటీ సీఈవో సుందర వరదరాజన్, డీఆర్‌డీవో చందర్ నాయక్, డీపీవో జయసుధ, మైన్స్ ఏడీ సత్యనారాయణ, డీసీవో సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

కామారెడ్డి క్రైం: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మహిళ మృతి చెందిన ఘటన కామారెడ్డికి సమీపంలోని నర్సన్నపల్లి డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్ వైపు నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని డీసీఎం వాహనం రోడ్డు పక్కనే నడుచుకుంటు వెళ్తున్న గుర్తు తెలియని మహిళను ఢీకొంది. సమీపంలోని దాబా సిబ్బంది గమనించి ఘటన స్థలానికి వెళ్లి చూడగా మహిళ అప్పటికే మృతి చెందింది. దీంతో పోలీసులు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.



విద్యుత్ తీగలు పడి ఆరు గొర్రెలు మృత్యువాత



మృతి చెందిన గొర్రెలు

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి శివారులో విద్యుత్ తీగలు మీద పడటంతో ఆరు గొర్రెలు మృతి చెందాయి. మంగళవారం గ్రామానికి చెందిన దొడ్ల నర్సయ్య తన గొర్రెల మందను మేపేందుకు గ్రామ శివారులోని బేసీసు ఫార్మ కంపెనీ సమీపంలోకి వెళ్లాడు. అక్కడ ఉన్న విద్యుత్ తీగలు కాసరం విరిగి కిందపడ్డాయి. గొర్రెలపై విద్యుత్ ప్రవహిస్తున్న తీగలు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. తీగలు కింద పడ్డ ప్రాంతానికి కొద్ది దూరంలో నర్సయ్య ఉండడంతో ఆయనకు ప్రాణాపాయం తప్పింది. విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో వారు సరఫరాను నిలిపివేశారు.

కుప్రియల్‌లో గేదె..



సదాశివనగర్: మండలంలోని కుప్రియల్‌లో కరెంట్ షాక్‌తో మంగళవారం గేదె మృతి చెందింది. గున్నల మాధవికి చెందిన జెర్సీ గేదె మేతకు వెళ్లి విద్యుత్ స్తంభానికి తాకడంతో షాక్ కొట్టి చనిపోయింది. ఘటన స్థలాన్ని జెడ్పీటీసీ నర్సింలు సందర్శించి విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు.